క్లుప్తంగా

అంగన్వాడీ సెంటర్‌ను కొనసాగించాలి

కడప కార్పొరేషన్ : కడప మసాపేట లోని సున్నపురాళ్ల మిట్ట అంగన్వాడీ సెంటర్‌ను యథావిధిగా కొనసాగించాలని జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్ చేశారు. బుధవారం సెంటర్ వద్ద వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో టీచర్‌కు ఆయాకు వచ్చిన గొడవకు పరిష్కారం చూపకుండా అంగన్వాడీ సెంటర్ వేరే చోటకు తరలించి ఇక్కడ పనిచేసే ఆయాను వేరో చోటకు అనధికారికంగా పంపి గత నెల రోజులుగా అంగన్వాడీ సెంటర్ లేక పిల్లలు గర్భిణీలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు సున్నాపురాళ్ల మిట్ట అంగన్వాడీ సెంటర్ ను యాథావిధిగా కొనసాగించాలన్నారు. స్థానిక ఆయాను కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మృత్యుంజయకుంట ఆలయ చైర్మన్ నియామకం

కడప సెవెన్‌రోడ్స్ : కడప మృత్యుంజయకుంట శివాలయం చైర్మన్‌గా నగరంలోని కొండాయపల్లెకు చెందిన పల్లినేని నాగేశ్వరనాయుడును ప్రభుత్వం నియమించింది. ఆయన జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడిగా ఉంటూ నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థికసాయం

కడప అర్బన్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో హోమ్ గార్డుగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన ఎస్.రఘువర్మ(హెచ్.జి 486) కుటుంబానికి జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్ రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందచేశారు. హోంగార్డ్ రఘువర్మ సతీమణి కె.విజయమేరికి పోలీస్ వితరణ నిధి నుండి ఈ మొత్తాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏ.ఓ కె.వెంకటరమణ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఈ.సి మెంబర్ ఏప్రిన్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీలలో రిమ్స్ విద్యార్థుల ప్రతిభ

కడప అర్బన్ : కర్నూలులోని కెఎంసీలో నేషనల్ నియోనాటాలజీ ఫోరం ఆధ్వర్యంలో వివిధ మెడికల్ కళాశాలల పీజీ వైద్య విద్యార్థులకు నిర్వహించిన జోనల్ క్విజ్ పోటీలలో కడప రిమ్స్ పీడియాట్రిక్స్ విభాగంలో ద్వితీయ సంవత్సరం పీజీ చదువుతున్న విద్యార్థినులు డాక్టర్ లక్ష్మీ సాయిపూజ, డాక్టర్ వి. భవ్యశ్రీలు ద్వితీయ స్థానాన్ని సాధించారు. మొత్తం 8 కళాశాలలు ఈ క్విజ్‌లో పాల్గొన్నాయి. ఆగష్టు 26న కర్నూలులోని కెఎంసిలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ నిర్వహించిన జోనల్ క్విజ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు డాక్టర్ పి.దేవిక, డాక్టర్ అక్షత్ పాల్గొని 2వ స్థానాన్ని పొందారు. మొత్తం 9 కళాశాలలు ఈ క్విజ్‌లో పాల్గొన్నాయి. బుధవారం వీరిని కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, పీడియాట్రిక్ హెచ్ఓడి డాక్టర్ వంశీధర్, వైద్యులు అభినందించారు.

అన్ని స్కూళ్లకు పుస్తకాలు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయి 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఆడపిల్లలకు వారి వ్యక్తిగత ఆరోగ్య విషయాల గురించి తెలుసుకొనేందుకు ముద్దమందారం పేరుతో పుస్తకాలను ముద్రించి జిల్లాలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని కడప జిల్లా జీసీడీఓ ఆరోగ్య మేరి తెలియజేశారు. కడప నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో విద్యార్థినులకు బుధవారం ముద్దమందారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ మాట్లాడుతూ ఆడపిల్లలకు అవగాహన కోసం రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన ఈ పుస్తకాలు కడప సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ముబీనారిహానా, విజయకుమారి, గురులక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయాలను సాధిద్ధాం

కడప ఎడ్యుకేషన్ : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని, ఆమె ఆశయాలను సాధిద్దామని చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున పిలుపునిచ్చారు. కడప ప్రకాష్ నగర్ లోని చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అవ్వారు మల్లికార్జున, జెవి రమణ, బి.ఓబయ్య, యస్.మనోహర్, డి.యం.ఓబులేసు యాదవ్, ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తిరుగుబాటుకు స్ఫూర్తి ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రమణ, జయరాం, మల్లేష్, నాగేశ్వరరావు షిండే భాస్కర్, శంకర్, కై పు రామాంజనేయులు, ప్రవీణ్, అమీన్ పీరా, కమలాపురం రమణ, మధు, మస్తానయ్య పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్‌లో మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) వారు క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ పాసైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు.

మానసికంగా బలంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీత



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిమ్స్ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం 3 ,4 యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్. కె. లలిత, డా యస్. సునీత ఆధ్వర్యంలో బుధవారం ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ మాట్లాడుతూ ఆత్మహత్య అనేది అత్యంత కఠినమైన నిర్ణయమని తెలిపారు. మార్కులు సరిగా రాలేదని, ప్రేమ విఫలమైందని, కుటుంబ కలహాలతో, సర్దుబాటు లేని కారణంగా క్షణికావేశంతో ఆత్మహత్యలు చేసుకోవడం అనేది దేశానికి, కుటుంబానికి తీరని నష్టమన్నారు. ఎన్.ఎస్.ఎస్ సమన్వయకర్త ఎస్.వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ సూసైడ్ అనేది చాలా తప్పు అని, భూమిపై జన్మించిన ప్రతివ్యక్తి పూర్తిగా జీవించే హక్కు ఉందన్నారు. చిన్న చిన్న కారణలతో ఆత్మహత్య చేసుకోవడం వల్ల కుటుంబం, సమాజానికి క్షోభ కలుగుతుందన్నారు. డాక్టర్ సునీత మాట్లాడుతూ విద్యార్థి దశలో శారీరక, మానసిక సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. డాక్టర్. కె.లలిత ఆత్మహత్యలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రియాజున్నీసా, డాక్టర్. మునికుమారి, డా.అశ్వర్థరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలకు చావు పరిష్కారం కాదు

సమస్యలకు భయపడి చావాలనుకోవడం పరిష్కారం కాదని, దానిని అధిగమించేందుకు మార్గాలు అనేకం ఉన్నాయని సైకాలజిస్టు ఓ. వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప కోటిరెడ్డి మహిళా కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, ఇంటాక్ కడప చాప్టర్, మన నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైకాలజిస్ట్ ఓ. వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బతికి సాధించాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు డాక్టర్ ఆర్ రంగనాథరెడ్డి మాట్లాడుతూ మానసికంగా బలహీనపరిచే ఏ ఒక్క అంశాన్ని మనదరికి చేరనీయవద్దన్నారు. కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సలీం బాష మాట్లాడుతూ బలమైన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ వారు మీ గమ్యం మీ చేతుల్లోనే అనే స్ఫూర్తిదాయక పుస్తకాలను ఉచితంగా విద్యార్థినిలకు, లైబ్రరీకి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎం. గురు మోహన్ రెడ్డి, మహిళా సాధికార విభాగం కన్వీనర్ నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన పెరగాలి

కడప అర్బన్: మానసిక ఆవేదనతో ఎవరైనా సరే బాధపడుతూ ఉన్న సమయంలో ఇతరులతో తమ ఆవేదనను పంచుకోవాలని, లేకుంటే ఆత్మహత్యలు చేసుకోవాలని భావన కలుగుతుందని, అలా కలగకుండా ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని రిమ్స్ అధికారులు ప్రిన్సిపల్ డాక్టర్ జమున, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి తెలియజేశారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం జరుపుకుంటారు. ఇందులో భాగంగా బుధవారం కడప రిమ్స్ ఆవరణంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రాముడు ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ హిట్ కాదు.. సూపర్ మోసం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసి జరుపుతున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు, సూపర్ సిక్స్ సూపర్ మోసం అని పెట్టి ఉంటే బాగుండేదని వైఎస్ఆర్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్. శివరామ్ ఎద్దేవా చేశారు. బుధవారం సాయంత్రం జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ కమిటీ నాయకులు ఎస్. విజయ భాస్కర్, కె. శివయాద్, ఎస్. బసవరాజులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలతోపాటు నూట నలభైకి పైగా హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు గడిచాయని ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఒక సంవత్సరం ఎగ్గొట్టి .. ఆ తర్వాత అరకొరగా ఇచ్చి తల్లులను, రైతులను మోసం చేశారన్నారు. అరవై సంవత్సరాలలోపు మహిళలకు నెలకు పదిహేను వందలు ఇస్తామని ఆ హామీ కూడా ఎగ్గొట్టి మహిళలను మోసం చేశారు, నిరుద్యోగులకు ఇరవై లక్షల ఉద్యోగాలు లేదా మూడు వేలు నిరుద్యోగభృతి ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు యాభై సంవత్సరాలకే పింఛన్ ఇస్తామని, బీసీలకు రక్షణ చట్టం తెస్తామని చెప్పి ఓట్లు దండు కొని మోసం చేసారని తెలిపారు. అందుకే మీరు అనంతపురంలో జరుపుకుంటున్న సభకు 'సూపర్ సిక్స్ సూపర్ మోసం' అని పేరు పెట్టుకోవాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని బాలాజీ నగర్ యూత్ హాస్టల్ బిల్డింగ్‌లో ఆర్‌వీపీ స్టాటిక్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు పప్పులేటి వెంకట సుబ్బయ్య ఒక ప్రకటన తెలిపారు. శిబిరంలో దంత పరీక్షలు, చర్మం, జుట్టు సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. పేర్ల నమోదుకు 95050 46850 అనే నెంబర్ ను సంప్రదించాలని ఆయన కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రవ్యాప్తంగా యువతరం తమ విద్యను పూర్తి చేసి ఉపాధి అవకాశాలు లేక అతలా కుతలమవుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్ష ఆర్గనైజింగ్ సెక్రటరీలు పెద్దలపల్లి ప్రభాకర్, చెప్పలి శివనాగేంద్ర తెలిపారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో 17న విజయవాడలో జరిగే నిరుద్యోగి ఆవేదన సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు చంద్ర, అరుణ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

12న కబడ్డీ సెలక్షన్స్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈనెల 12న జిల్లా జూనియర్ బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ డీఎస్ఏ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ గురు శేఖర్, సెక్రటరీ వెంకటసుబ్బయ్య, వర్కింగ్ సెక్రెటరీ శ్రీవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ సెలెక్ట్ అయిన క్రీడాకారులు ఈనెల 22, 23, 24, 25 తేదీలలో విజయవాడలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగబోయే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు. వివరాలకు 91334 80661, 99493 04160 సంప్రదించాలన్నారు.

అక్రమాలను అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాయలసీమ ఆర్‌సీఎం డయాసిస్ ఎయిడెడ్ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో కడప జిల్లా వ్యాప్తంగా అవకతవకలకు పాల్పడిన ఆర్‌సీఎం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం ఈ మేరకు డీఈవో కార్యాలయంలో ఏడీ రామకృష్ణ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహ పాల్గొన్నారు.

భూ సమీకరణపేరుతో చంద్రబాబుకు లబ్ధి

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు కె.విజయరాఘవన్



మాట్లాడుతున్న కె.విజయరాఘవన్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏపీలో భూసేకరణ, భూ సమీకరణ పేరుతో రైతులకు నష్టం కలిగిస్తూ సీఎం చంద్రబాబు లబ్ధి పొందుతున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కె.విజయరాఘవన్ విమర్శించారు. గ్రామీణ ఉపాధి చట్టం బలోపేతం చేసేందుకు అక్టోబరులో దేశ వ్యాప్తంగా 30 వేల గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు ఆయన తెలిపారు. కడప హరిత హోటల్‌లో కేరళ రాజ్యసభ సభ్యుడు ఎంపీ శివదాసన్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా లక్షలాది ఎకరాలను ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో గుత్తి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సోలార్ ప్రాజెక్టులకు బలవంతంగా భూములు తీసుకుని రైతులకు అన్యాయం చేస్తున్నారని వివరించారు. ఈ సమస్యలతోపాటు, గ్రామీణ ప్రాంతాల పేదలు, సన్న, చిన్నకారు రైతుల కష్టాలు, తదితర అంశాలపై భవిష్యత్తు కార్యాచరణకు సమావేశంలో చర్చించామన్నారు. భూమిలేని పేదలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారని, వారి జీవన ప్రమాణాలకు ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. దళితులు, ఆదివాసీలు, బలహీన వర్గాలు, మహిళల శ్రమ కారణంగా సంపద వృద్ధి అవుతున్నా.. వారికి వాటా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు మాత్రమే లబ్ధి చేకూరుతోందని, పి-4 పథకం పేరుతో ధనికులకు దత్తత ఇవ్వడం వెనుక పేదల వనరులను దోచుకునే కుట్ర జరుగుతోందని వివరించారు. భూ పంపిణీపై కౌన్సిల్‌లో చర్చించామని తెలిపారు. బీజేపీ డబుల్ ఇంజిన్ అయితే.. కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలతో తమది ట్రిబుల్ ఇంజిన్ అంటూ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘాల జాతీయ కార్యదర్శి బి.వెంకట్, విక్రమ్‌సింగ్, అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కన్వీనర్ లలితాబాలన్, కేరళ వ్యవసాయ కార్మిక సంక్షేమ సంఘం బోర్డు చైర్మన్ చంద్రన్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ శివ నాగరాణి, జి.చంద్రశేఖర్, మనోహర్, రామ్మోహన్, జి.శివకుమార్, వి.అన్వేష్, బి.దస్తగిరి రెడ్డి, 22 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వకపోతే ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శంకర్ అన్నారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సబ్సిడీ రుణాలు విడుదల చేయాలని, ఈ రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఏప్రిల్ 10వ తేదీ నోటిఫికేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులు బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాలకోసం సుమారు ఆరు వేల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే ఇంతవరకు ఇంటర్వ్యూకు పిలవడంగానీ, అర్హుల జాబితా రూపొందించడం గానీ చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈగల్ బృందం, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం అని జిల్లా ఈగల్ బృందం పేర్కొన్నారు. కడప సంధ్య సర్కిల్ వద్ద గల డాన్ బాస్కో ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై జిల్లా 'ఈగల్' బృందం, నార్కోటిక్ బృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ తమ పాత్ర పోషించాలని కోరారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 'ఈగల్' పేరుతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మాదక ద్రవ్యాల చట్టాలు వాటిలోని కఠిన శిక్షల గురించి వివరించారు. డ్రగ్స్ వాడకం, అమ్మకాలు చట్ట ప్రకారం నేరమన్నారు. మీ ఇల్లు లేదా పాఠశాల చుట్టుపక్కల డ్రగ్స్ అమ్మకాలు లేదా దుర్వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే, వెంటనే 1972 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు డ్రగ్స్ నివారణలో భాగస్వాములు అవుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జార్జ్, ట్రైనింగ్ ఆఫీసర్ కృపాకరం, నార్కోటిక్ సెల్ నుండి ఏఎస్ఐ మల్లయ్య, ఈగల్ బృందం సభ్యులు అయాబ్ ఖాన్, గురుశేఖర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి



అంబేడ్కర్ భవన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో రాజారెడ్డి క్రికెట్ స్టేడియం సమీపంలోని అంబేడ్కర్ భవనంలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన అంబేడ్కర్ భవన్‌ను పరిశీలించారు. పెండింగ్ పనులు పూర్తి చేసి త్వరగా భవనాన్ని అందుబాటులోకి తేవాలని సూచించారు. అంతకుముందు లక్ష్మీనగర్‌లోని టిడ్కో భవనాలను పరిశీలించి అక్కడ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పరిసరాలను చూసి అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొన్నారు. అక్టోబర్ 2వ తేదిలోపు అన్ని మరమ్మతులు పూర్తి చేసి గృహాలను లబ్దిదారులకు అందించాలని ఆదేశించారు. అనంతరం దేవునికడపలోని రెండు వంతెనలు, క్రిష్ణా సర్కిల్ నుంచి దేవునికడప వరకూ జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి ప్లానింగ్ అధికారులకు తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఈఈలు, హార్టికల్చర్, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



ఎన్జీఓ హోమ్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన పాలక వర్గం

కడప రూరల్ : ఏపీ జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం స్థానిక ఆ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో జరిగాయి. ఆ సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎం పెంచలరావు జిల్లా ఎన్నికల అధికారిగా, సహాయ ఎన్నికల అధికారిగా జీ రామక్రిష్ణ వ్యవహరించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కే జగదీశ్వరరావు నామినేషన్‌లను స్వీకరించారు. 17 పోస్టులకు గాను 17 మందే నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులు

జిల్లా అధ్యక్షులుగా టీ శ్రీనివాసులు, సహ అధ్యక్షులుగా టీ తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏ నరేంద్ర, యం బాలపుల్లయ్య, సీ దస్తగిరి, పోలిరెడ్డి, సీ సిద్దయ్య, యం లక్ష్మీదేవి, కార్యదర్శిగా పి నిత్యపూజయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యం బ్రహ్మానందరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా యస్ నరసింహారెడ్డి, యన్ రాజశేఖర్, డీ.పద్మనాభరావు, ఈ ఇరామియ్య, జి.శ్రీనివాసులు, కే.సుహాసినికుమారి, కోశాధికారిగా టీ శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నికపై అభ్యంతరాలు..

ఈ ఏకగ్రీవ ఎన్నికపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. నిబంధనల ప్రకారం జిల్లా కమిటీ కాల పరిమితి మూడేళ్లు. ఆ ప్రకారం ప్రస్తుత కమిటీ కాల పరిమితి ఆగష్టు 31వ తేదీ నాటికి పూర్తయింది. అనంతరం నోటిఫికేషన్ ఇచ్చి 40 రోజుల్లో ఎప్పుడైనా ఎన్నికలు జరపవచ్చు లేదా తాలూకా సంఘాల ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నిక కావచ్చు. కాగా ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా చేపట్టిన ఏకగ్రీవ ఎన్నిక చెల్లదనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు స్పందించారు. మా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ ఆదేశాల ప్రకారం, నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించామని అన్నారు. వచ్చిన ఆరోపణలు అవాస్తవమని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ఆర్ఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్‌యూనిటీ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అనేకమార్లు విన్నవించామని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్‌యూనిటీ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి సుధాకర్ కోరారు. బుధవారం సాయంత్రం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డికి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప, జమ్మలమడుగు డిపో మేనేజర్లు సమస్యలను పరిష్కరించకుండా ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. సంస్థ నియమ నిబంధనలు పాటించకుండా, ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంగా పలుమార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర కార్యాలయం ఇచ్చిన ఆదేశాలను 1/2019 సర్క్యులర్ అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు ప్రతినెల మూడు సెలవులు, చైల్డ్‌కేర్ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగముని, సగినాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి దిశగా ఆలోచించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్

కడప ఎడ్యుకేషన్ : డిగ్రీ, పీజీ పూర్తిచేసిన ప్రతి విద్యార్థి స్వయం ఉపాధి దిశగా ఆలోచించాలని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్ తెలిపారు. కడప రిమ్స్ రోడ్డులో గల స్పిరిట్స్ డిగ్రీ - పీజీ కాలేజీలో బుధవారం కెరీర్ కాన్ఫరెన్స్ తోపాటు స్వయం ఉపాధి ప్రోగ్రామ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కడప జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ యువత ఉద్యోగం చేయడం కన్నా, ఉద్యోగం ఇచ్చేటట్లు ఎదగాలన్నారు. అప్పుడే ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. మరో అతిథి డా' సంపత్ కుమార్ మాట్లాడుతూ బీపీటీ కోర్సు చేసిన వారికి దేశ విదేశాల్లో ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. డా' శ్రీనివాసులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సేల్స్ ఆఫీసర్ పావని మాట్లాడుతూ మార్కెటింగ్ స్కిల్స్ నేర్చుకొని మంచి ఉద్యోగం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవీంద్ర, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ రియాజుద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాసిరకమైన పేపర్ రోల్స్ సరఫరా దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న పీవీ శివారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నాసిరకమైన పేపర్ రోల్స్ సరఫరా చేయడం వల్ల ప్రింట్ సరిగా రాక ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఏపీ పీటీడీ మజ్దూర్ యూనిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి, ఎన్జీఓ అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కడప యూనియన్ కార్యాలయంలో రీజినల్ అధ్యక్షులు నాగముని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు అక్రమ పనిష్మెంట్లు, రికవరీలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి సుధాకర్, జోనల్ నాయకులు జనార్ధన్, ఎస్ఎం వలీ, కోడూరు సుబ్బారావు, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ భానుప్రసాద్, జిల్లాలోని ఆరు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు 13 వందల మెట్రిక్ టన్నుల యూరియా



జిల్లాకు వచ్చిన యూరియ గురించి సిబ్బందితో ఆరా తీసున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

కడప అగ్రికల్చర్ : ఉమ్మడి కడపజిల్లాకు 1300 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. ఇందులో వైఎస్సార్ జిల్లాకు సంబంధించి 800 మెట్రిక్ టన్నులురాగా ఇందులో 510 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్‌కు కేటాయించగా మరో 290 టన్నులను ప్రైవేటు డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లాకు సంబంధించి 500 మెట్రిక్ టన్నులు రాగా ఇందులో 400 టన్నులు మార్క్‌ఫెడ్‌కు కేటాయించగా మరో 100 టన్నులు ప్రైవేటు డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను ఎవరైనా బ్లాక్ మార్కెట్‌లో అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.



నీళ్లలో హోయ్ హోయ్..

కేసీ కెనాల్‌లో నీరు ప్రవహిస్తోంది. పాత కడప చెరువు కూడా నీటితో నిండుగా ఉంది. ఇంకేముంది.. యువకులు ఆ నీటిలో హోయ్.. హోయ్.. అంటూ సరదాగా ఈత కొట్టారు. చంద్ర గ్రహణం తరువాత మూడు రోజులుగా ఉక్క పోత అధికమైంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం పాత కడప యువకులు ఇలా చెరువు నీటిలో సరదాగా ఈత కొడుతూ సందడి చేశారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

